మూలం : ముహమ్మద్ రఫీఖాన్ — సేకరణ : తస్నీం జహాన్ ఖాన్




**(గత సంచిక తరువాయి)**

'పని పూర్తి అయిన తర్వాత మేరీనా నీకు సొంతం' అన్నాడు యెహోషువా.

'సరే అలా అయితే మీకు నేను అన్నివిధాలుగా సహకరిస్తాను' అని ఎగిరి గంతేశాడు చార్లెస్.

ఆ తరువాత ఆమె తండ్రి యెహోషువా, ప్రియుడు చార్లెస్ ఆమెను ముస్లింలు విడిది చేసిన ప్రాంతంలో వదిలేసివెళ్ళారు.

●●●

ఆలోచనల నుండి తేరుకున్న మేరీనాకు 'ఈ రోజు తనను కలుసుకోవటానికి చార్లెస్ మారు వేషంలో అక్కడకు వస్తాడనే విషయం గుర్తుకు రాగానే దానికోసం మానసికంగా సిద్ధమైంది.

కొద్దిసేపటి తర్వాత ఆమెకు చార్లెస్ గొంతు వినబడింది తనకు దగ్గరగా వచ్చి కూర గాయలు అమ్ముకునేవాడి వేషంలో నిల్చుని ఉన్నాడు చార్లెస్.

'ఆట ఎక్కడి వరకు వచ్చింది?' అని అడిగాడు. మేరీనా భయం వల్ల సమాధానమివ్వలేక పోయింది ఆ విషయాన్ని గ్రహించిన చార్లెస్ మళ్ళీ తనే 'పూజ్యుడైన యెహోషువా అన్ని అస్త్రాలు సంధించమని చెప్పాడు' అని చెప్పి అక్కడినుండి వెళ్ళిపోయాడు.

చార్లెస్ అటు వెళ్ళాడో లేదో సయీద్ బిన్ అమ్ర్ ఆమె వద్దకు వెళ్ళి వెళ్ళి నీకు ఎటువంటి కష్టం కలుగలేదు కదా, అని సైఫుల్లాహ్ అడిగి రమ్మన్నారు' అని అన్నారు.

ఒకవైపు తన కన్నతండ్రి, ప్రియుడు ఇద్దరూ కలిసి తనను శత్రుసైన్యంలో నిస్సహాయ స్థితిలో తమ స్వప్రయోజనాల కొరకు వదిలివేసి వెళ్ళారు. మరొకవైపు ఎవరినైతే వలవల్లి నాశనం చెయ్యాలనే ధ్యేయంతో తను వచ్చిందో ఆయన తన బాగోగులను గురించి అడగటం చాలా ఆశ్చర్యంగా ఉంది ఆమెకు.

తర్వాత 'నాకేమి కష్టంలేదు' అని సమాధాన మిచ్చింది మేరీనా.

ఈ సంఘటన తర్వాత ఆమె ఆలోచనా సరళి పూర్తిగా మారిపోయింది. ఎందుకంటే ఆమె మరొక విషయాన్ని గ్రహించింది. అదేమిటంటే, 'ఇక్కడ ఖాలిద్ బిన్ వలీద్ మాత్రమే కాదు. మరెవరూ కూడా ఆమె అందాల వైపు కన్నెత్తి కూడా చూడలేదు' ఇది గ్రహించి ఆమెకు నెత్తిపై పిడుగుపడినట్లు అనిపించింది.

మూడు రోజుల తరువాత ఆమెకు ఎటువంటి హానిలేదని నిర్ధారించుకున్న తరువాత ఆమెను ఎక్కడైనా సంచరించేందుకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వటం జరిగింది. ఆమె ఇప్పుడు ముస్లింల అలవాట్లు, వారి జీవన విధానం, దైవంతో వారికి ఉన్న అనుబంధం... ఇలా అన్ని విష యాలను గమనించటం మొదలుపెట్టింది.

చివరకు ఆరోజు రానే వచ్చింది. ఇరుసైన్యాలు యుద్ధమైదానంలో బారులు తీరి నిలబడ్డాయి. 2 లక్షల 40 వేల రోమన్ సైన్యం కళ్ళు చెదిరే హంగులతో ఖాలిద్ బిన్ వలీద్ సైన్యానికి ఎదు రుగా నిలబడింది. సిరియాలోనే అత్యంత బలవంతుడు, వీరుడు అయిన 'జర్జా' యుద్ధ మైదానంలోనే ఇస్లాం స్వీకరించినప్పుడు శత్రు సైన్యానికి మొట్టమొదటి షాక్ తగిలింది.

మేరీనా తొలిసారి ఇస్లామీయ సైన్యంలో ఉండి యుద్ధాన్ని తిలకిస్తుంది. ఆమెకు అంతా కొత్తగా ఉంది. అతి పెద్ద రోమన్ సైనిక వాహినిని చివరకు సైఫుల్లాహ్ చిత్తుచేశారు. ఇది చూసిన మేరీనా 'సైఫుల్లాహ్ బిరుదుకు ఖాలిద్ బిన్ వలీద్ తప్ప ఈ భూ ప్రపంచంలోనే ఎవడూ కాలేడు' అని మనసులో అనుకుంది. యుద్ధం ముగిసిన తరువాత క్షతగాత్రులకు వైద్యం చేయటం ప్రారంభమైంది. అక్కడి నుండి వీలై నంత త్వరలో బయలుదేరవలసి ఉంది. అందుకే పనులన్నీ చకచకా జరిగిపోతున్నాయి.

ఆ రోజు సూర్యోదయానికి ఇంకా చాలా సమయం ఉంది. కాని తన ఆలోచనలతో నిద్రపట్టని మేరీనా గుడారం వెలుపలకు వచ్చింది. అలాగే ఆలోచనల్లో మునిగి ఉన్న మేరీనాకు గుర్రపు డెక్కల చప్పుడు వినపడింది. తనకు దగ్గరగా వచ్చి ఆ చప్పుడు ఆగి పోయింది. చూస్తే, ఖాలిద్ బిన్ వలీద్ రాత్రి తహజ్జుద్ నమాజ్ ముగించుకుని, తన సైన్యం విడిది చేసిన ప్రాంతం అంతా తిరిగి గమని స్తున్నారు. ఆమెను అక్కడ చూసి

"అమ్మాయ్! ఇంకా తెల్లవారకముందే బయ

టకు వచ్చి ఇక్కడేం చేస్తున్నావ్?'అని అడిగారు ఖాలిద్ బిన్ వలీద్.

'నిద్ర పట్టక అలా బయటకు వచ్చాను' అంది మేరీనా.

'కొన్ని రోజుల తర్వాత మేము డెమాస్కస్‌కు బయలుదేరుతాము, అక్కడకు చేరిన తర్వాత నిన్ను సగౌరవంగా కోటలోకి చేరవేస్తాము. నీకు ఇక్కడ కష్టంగా లేదు కదా?"అని అడిగారు ఖాలిద్ బిన్ వలీద్.

'నాకే కష్టంలేదు... కాని నేను కోరేదేమిటంటే; నన్ను ఇక్కడే ఉంచుకుని డెమాస్కస్ వాసులతో మీ షరతులను ఒప్పుకునేలా చేయండి' అని చెప్పింది మేరీనా.

'మాకు ఎటువంటి షరతులు లేవు. మా లక్ష్య సాధనకు ఇటువంటి తప్పుడు మార్గాన్ని మేమెన్నడూ అవలంభించము. డెమాస్కస్ వాసులతో మాకు ఎటువంటి వ్యక్తిగత కక్షలు లేవు. నీవు ఎవరి ఆసరా లేని అనాధవని మేము నీకు సైన్యంతోపాటు ఇక్కడ ఉండే అవకాశాన్ని కల్పించాము. అంతే!'అన్నారు ఖాలిద్ బిన్ వలీద్.

"నేను అనాధను కాదు, సిరియాలోనే గొప్ప పేరుప్రతిష్టలున్న క్రైస్తవ పండితుడు అయిన యెహోషువా కూతుర్ని' అని చెప్పింది మేరీనా.

ఖాలిద్ బిన్ వలీద్ చాలా ఆశ్చర్యపోయారు.

"నేను డెమాస్కస్‌కు తిరిగి వెళ్ళాలనుకోవటం లేదు. ఇక నేను ఇస్లామీయ సైన్యంతో పాటే ఉంటాను. నేనిప్పుడు క్రైస్తవురాలిని కాదు. నేను ముస్లింని'అని చెప్పింది.

అంతా విని ఖాలిద్ బిన్ వలీద్ 'ఇక వెళ్ళి పడుకో'అని చెప్పి వెళ్ళిపోయారు.

డెమాస్కస్‌ను జయించిన తరువాత, ఒకరోజు యెహోషువా, చార్లెస్‌లు ఖాలిద్ బిన్ వలీద్ వద్దకు వచ్చి కొన్నాళ్ళ ముందు ఒక క్రైస్తవ అమ్మాయి, మీ సైన్యంలో చేరింది. ఆమె ఎక్కడా? అని అడిగారు.

ఖాలిద్ బిన్ వలీద్ మేరీనాను పిలిపించారు.

మేరీనా పూర్తిగా మారిపోయి ఉంది. ఆమె శరీరం మొత్తం కప్పుకొని ముస్లిం స్త్రీల వేషధారణలో ఉంది.

'వీరు నీకు తెలుసా?'అని అడిగారు.

'తెలుసు సైన్యాధ్యక్షా! నేను ఇక్కడకు రాక పూర్వం ఈయన నా తండ్రి, ఇతను నా ప్రియుడు. కాని ఇప్పుడు నాకు వీరితో ఎటువంటి సంబంధంలేదు' అని జవాబిచ్చింది మేరీనా.

'మేరీనా! నువ్వేమంటున్నావ్? మేము నిన్ను తీసుకెళ్ళటానికి వచ్చాము. నువ్వు లేకుండా నేను, చార్లెస్ ఉండలేమని తెలుసుగదా?' అన్నాడు యెహోషువా.

"అప్పుడే తీసుకెళ్ళిపోతారా నాన్నగారూ? నేనింకా ఖాలిద్‌ను వలలో వేసుకోనేలేదే?'అని అంది వ్యంగంగా మేరీనా.

'నా అందాలను తమ స్వప్రయోజనాల కొరకు ఉపయోగించుకునే తండ్రి, ప్రియుడు నన్ను శత్రుసైన్యంలో వదిలేసి వెళ్ళారు. కాని నన్ను, నా గౌరవాన్ని, నా శీలాన్ని శత్రువులు సంరక్షించారు. అలాంటప్పుడు నేనెక్కడ సురక్షితంగా ఉండగలనో మీరే చెప్పండి?' అని అడిగింది.

'ఎల్గాగైనా నువ్వు మాతో రావలసిందే. ఎందుకంటే నువ్వు ముస్లింలతోపాటు ఉండటం మాకు ఇష్టంలేదు'అన్నాడు చార్లెస్.

'అలాగా... నేను ముస్లింలతోపాటు ఉండటం మీకు ఇష్టంలేదా? మరి నా శీలాన్ని ముస్లింలకు అప్పగించటం ఇష్టమా? అయినా శీలం గురించి మీకేం తెలుసు, దాని గురించి మీరు మీ శత్రువులమైన మా దగ్గర తెలుసుకోవలసిందే'అంది మేరీనా.

"మేరీనా నీకు పిచ్చి పట్టిందా?' అన్నాడు యెహోషువా.

'కాదు... నా పిచ్చి వదిలింది. మీ సమాజంలో నేను కేవలం ప్రియురాలిని మాత్రమే, కాని స్త్రీని తల్లి, సోదరి, కూతురులాంటి గౌరవప్రదమైన స్థానాలు ప్రసాదించే సమాజం నాకు దొరికింది. స్త్రీని కేవలం కామం నిండిన కళ్ళతో చూసే మీ సమాజాన్ని నేనిప్పుడు అసహ్యించుకుంటున్నాను'అంది మేరీనా.

'మేరీనా!' గట్టిగా అరిచాడు చార్లెస్.

"మేరీనా కాదు మర్యం! నేను క్రైస్తవురాలిని కాదు ముస్లింని, ఇక మీరు వెళ్ళవచ్చు' అంది మేరీనా.

వారిద్దరూ ఖాలిద్ బిన్ వలీద్ వైపు చూశారు.

'ఆమె ముస్లిం. ఆమె సంరక్షణ మా బాధ్యత, ఆమె రానంటుంది. కాబట్టి ఆమెను మీరు తీసుకొని వెళ్ళలేరు'అన్నారు ఖాలిద్ బిన్ వలీద్.

చేసేదేమీ లేక పాలిపోయిన ముఖాలతో ఇద్దరు అక్కడి నుండి వెనుదిరిగి వెళ్ళిపోయారు.

●●●

మర్యం వద్ద నుండి వెనుదిరిగి వచ్చిన యెహోషువా, చార్లెస్‌లు ఇస్లాంకు వ్యతిరేకంగా తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అదేమిటోగాని ఎవరి మాట లెక్కచేయక ప్రజలు తండోపతండాలుగా ఇస్లాం స్వీకరిస్తున్నారు. మరొకవైపు డెమాస్కస్‌పై ముస్లింలు పూర్తి పట్టు సాధించారు. ఎంతోకాలంగా రోమ్ రాజధానిగానే కాకుండా, ప్రపంచ క్రైస్తవులకు కేంద్రంగా ఉన్న డెమాస్కస్ చేజారిపోయింది. పూర్తిగా ముస్లింల ఆధీనంలోనికి వచ్చేసింది. ముస్లింల వద్ద ఏ మంత్రం ఉందోగాని, ఇస్లాం వ్యతిరేక ప్రచారం ఎంతగా చేసినా సరే డెమాస్కస్ ప్రజలు మాత్రం క్రైస్తవాన్ని వదిలి ఇస్లాం స్వీకరిస్తూపోతున్నారు.

అన్నివైపుల నుండి అపజయాన్ని ఎదుర్కొన్న యెహోషువా, చార్లెస్‌లు తమలో తామే వాదులాడుకోసాగారు.

"మనం ముస్లింల సైన్యంలోనికి పంపించిన గూఢచారులందరు ఇస్లాం స్వీకరించి మనకు వ్యతిరేకంగా వారితో చేయి కలిపారని తెలిసి కూడా, మేరీనాను అక్కడకు పంపించి తెలివి తక్కువ పనిజేసిన మూర్ఖుడివి నువ్వు'అన్నాడు చార్లెస్ యెహోషువాతో.

'మరి నువ్వు కూడా సహకరించావుగా' అన్నాడు యెహోషువా.

'అది ఇలా చేస్తుందని నాకేం తెలుసు' అన్నాడు చార్లెస్.

'ఆ విషయం నాకు మాత్రం ఏం తెలుసు' అన్నాడు యెహోషువా.

'నేను ఏదో ఒకటి చేయాలి, నాకు దక్కనిది ఈ భూమి మీద ఉండటానికి వీల్లేదు'అన్నాడు చార్లెస్.

‘అవును. ఒక గొప్ప క్రైస్తవ పండితుడినైన నా కుమార్తె ముస్లింగా బ్రతకటం నాకూ ఇష్టం లేదు’అన్నాడు యెహోషువా.

‘చంపేద్దాం’ అన్నారు ఇద్దరూ ఒకేసారి

మర్యం క్షతగాత్రులకు కట్లు కట్టే పని చేస్తుం దని తెలుసుకున్నారు.

ఆరోజు చీకటిపడిన తరువాత ఇద్దరూ పథకం ప్రకారం ముస్లిం సైన్యం ఉన్న ప్రదేశంలోనికి చొరబడి, క్షతగాత్రుల శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న మర్యంను పొడిచి పారిపోయే ప్రయత్నం చేశారు. మర్యం అరుపుకి అక్కడ ఉన్న ముస్లిం సైనికులు పారిపోతున్న యెహోషువా, చార్లెస్‌లను వెంబడించి పట్టుకున్నారు.

వారిద్దరినీ ఖాలిద్ బిన్ వలీద్ వద్దకు తీసుకుని వచ్చారు. చార్లెస్ అకస్మాత్తుగా తన ఖడ్గాన్ని తీసి ‘నీ మూర్ఖత్వానికి నా ప్రేమ బలయ్యింది’ అని యెహోషువాను పొడిచి చంపాడు. అక్కడే ఉన్న ఖాలిద్ బిన్ వలీద్ కరవాలం చార్లెస్ శిరస్సును ఛేధించింది.

యెహోషువా, చార్లెస్‌లు రక్తపు మడుగులో ప్రాణాలు వదిలారు.

తరువాత ఖాలిద్ బిన్ వలీద్ మృత్యువుకు సమీపంలో ఉన్న మర్యం వద్దకు చేరుకున్నారు.

‘సైపుల్లాహ్! నేనిక్కడకు రాక పూర్వం, నాకు మీకంటే పెద్ద శత్రువు ఎవరూ లేరు, మిమ్మల్ని నా అందాల ముగ్గులోనికి దింపటానికి వచ్చిన నేను మీ సౌశీల్యం, మీ సత్ప్రవర్తన ముందు చేతులెత్తేశాను. మిమ్మల్ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దిన ఇస్లాంను స్వీకరించాను. చనిపోతూ కూడా చెబుతున్నాను; నేను మిమ్మల్ని, మీ ధర్మాన్నీ ప్రేమిస్తున్నాను. ఈ విజయం సౌశీల్యానిది. అశ్లీలం ఓడిపోయింది సత్ప్రవర్తన గెలిచింది’ అని చెప్పింది మర్యం.

‘ఇది చనిపోవటం ఎంతమాత్రం కాదు, నువ్వు షహాదత్ (అమరగతి) పొందావు. ఏ షహాదత్ కోసం అయితే నేను ఎన్నాళ్ళ నుంచో దైవ మార్గంలో పోరాడుతూ వచ్చానో అది నీకు వరించింది. నువ్వు చాలా అదృష్టవంతురాలివి’ అని ఖాలిద్ బిన్ వలీద్ అంటుండగానే మర్యం ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్ళిపోయింది.

**(సమాప్తం)**

**కవితా కవాతు**

**షేఖ్ కరీముల్లా, వినుకొండ**

# మట్టిగాజులు

చెత్తకుండీలో
విసరబడ్డ గాజుపెంకుల్లా
మొహల్లా స్వప్నాలు
మా జిందగీలంతే
మట్టి గాజులై
వృత్తాకార వలయాలై
భారంగా కదిలే ఎడారి ఒడల్లా
టీ కప్పులో చలిచీమల్లా
దశాబ్దాల్ని ఈదుతుంటాయి
చింపి పారేసిన
చెల్లని ఓటుముక్కలా
ఔట్ డేటెడ్ ఓటర్ కార్డులా
దృశ్యాల్ని మార్చుకుంటాయి
అనాదిగా ఆపాదించబడుతున్న
అనాకారి తనంతో
కలుగులో మూలుగులమై
ఎన్నాళ్ళు ముడుచుకుంటామో తెలీదు
అబద్ధమాంత్రికులంతా
తలపై కుచ్చుటోపీ పెట్టి
వంగి వంగి సలాం చేస్తుంటే
చిరుగుల టోపీ మర్చిన గరీబోళ్ళం
వాళ్ళ లయబద్ధ తాంత్రిక
రాజకీయ ఉచ్ఛారణా విన్యాసాల్ని
మురిపెంగా చూస్తూ
కటిక మొద్దుపై మెడలు సాచిన
లేగ దూడలమై మేం
ప్చ్... అయిదేళ్ళకోసారి అంతే
మా మెదడు గూళ్ళలో
వెలుతురు పిట్టలు వాలిన ప్రతీసారి
తెరవెనుక పరివార్ పేల్చే
టెర్ర్ బాంబులకు
తెగిపడే అవయవాలు మావే
అవమానాలు మావే
ఎన్నికల రుతువొచ్చాక
అందరికీ మేం
రంగురంగుల చేతిగాజులమే
అవసరం తీరాక
ఫెటిల్లుమనే మట్టిగాజులమే